
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కర్ణాటక వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024

ఢిల్లీకి 500 మంది బీజేపీ ప్రతినిధులు

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ప్రగతి మైదానంలో శనివారం ప్రారంభమైన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు రాష్ట్రం నుంచి 500 మంది ప్రతినిధులు హాజరయినట్లు పార్టీ శనివారం ప్రకటించింది. జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై. విజయేంద్రతో పాటు రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, కార్యవర్గ సభ్యులు, కోర్‌కమిటీ సభ్యులు, వివిధ మోర్చాల పదాధికారులు వీరిలో ఉన్నారని ప్రకటనలో తెలిపారు.

గ్యారెంటీలతో ప్రజలకు భరోసా


వేదికపై కాంగ్రెస్ అగ్రనేతలు

- ప్రధాని మోదీ అతిపెద్ద అబద్ధాలకోరు
- రాష్ట్రం కోసం పార్లమెంటులో ఏనాడైనా నోరు విప్పారా..?
- బీజేపీ ఎంపీలపై నిప్పులు చెరిగిన సీఎం సిద్దరామయ్య
- లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కండి : పార్టీ శ్రేణులకు నేతల పిలుపు

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఐదు గ్యారెంటీ పథకాలతో ప్రజల జీవితాలకు భరోసా కల్పించిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. దక్షిణకన్నడ జిల్లా మంగళూరులో శనివారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల భారీ సమావేశాన్ని ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చురేపి రాజకీయ పబ్బం గడుపుకోవడమే బీజేపీ ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ప్రధాని మోదీ పదే పదే కాంగ్రెస్‌పై నోరు పారేసుకుంటుంటారన్నారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆయన అలా చేస్తారన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలకు మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. విదేశాల్లో నల్లధనాన్ని దేశానికి రప్పిస్తామని, ప్రతి పౌరుడి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని హామీలు ఇచ్చారని వీటిలో ఏ ఒక్కటైనా అమలైందా..? అని ప్రశ్నించారు. చేతకాని హామీలతో ప్రజలను వంచించడం కాంగ్రెస్ నైజం కాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఆర్థిక సవాళ్లు ఉన్నా ఐదు గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తున్నామన్నారు. ప్రధాని మోదీలా పచ్చి అబద్ధాలు చెప్పే నేతను స్వతంత్ర భారతంలో తాను ఇంతవరకు చూడలేదన్నారు. దక్షిణకన్నడ జిల్లాకు చెందిన నళిన్‌కుమార్ కటీల్‌గానీ, శోభా కరంద్లాజెగానీ, రాష్ట్ర ప్రజల కోసం పార్లమెంటులో ఏనాడైనా నోరు విప్పారా... అంటూ నిలదీశారు. బీజేపీకి చెందిన 26 ఎంపీలదీ ఇదే తంతు అన్నారు. 2013 నుంచి 2018 వరకు అప్పట్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశామని, 2023 శాసనసభ ఎన్నికల్లో ప్రజలు భారీ మెజారిటీతో ఆశీర్వదించాక 8 నెలల అవధిలోనే మొత్తం ఐదు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను 20కిపైగా స్థానాల్లో గెలిపిస్తే కేంద్రంతో పోరాడి రాష్ట్ర హక్కులు సాధించుకుంటామన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, నీటిపారుదల ప్రాజెక్టుల కోసమే కేంద్రంతో పోరాడుతున్నామని, రాజకీయాల కోసం కాదని స్పష్టం చేశారు. గ్యారెంటీలతో రాష్ట్రం దివాళా తీస్తోందన్న బీజేపీ నేతల వాదనను ఆయన కొట్టిపారేశారు.

తాను సమర్పించిన బడ్జెట్‌ను చూసైనా బీజేపీ నేతలు కళ్లు తెరిస్తే మంచిదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలతో బెంబేలెత్తిన ప్రధాని మోదీ మీడియా ద్వారా మోదీ గ్యారెంటీ అంటూ భజన ప్రారంభించారని ఎద్దేవా చేశారు. ఒకపక్క రాష్ట్రంలో గ్యారెంటీ పథకాలు అందుకుంటున్న ప్రజలను అవమానిస్తూ మరోపక్క బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత గ్యారెంటీలను అమ లు చేస్తున్నారని, బీజేపీ రెండు నాలుకల ధోరణికి ఇది తిరుగులేని తార్కాణమన్నారు. తమ గ్యారెంటీలను ప్రధాని కాపీ కొట్టారని చురకలంటించారు.

కాంగ్రెస్‌ను ఆడిపోసుకోనిదే నిద్రపట్టదు..

పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్‌ను చూసి ఇంకా వణికిపోతూనే ఉన్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. పదేళ్లుగా దేశాన్ని అభివృద్ధి చేసి ఉంటే, ఇచ్చిన హామీలు నిలబెట్టుకుని ఉంటే వాటినే ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌ను ఆడిపోసుకోనిదే ప్రధాని నరేంద్రమోదీకి నిద్రపట్టదన్నారు. కాంగ్రెస్‌ను బూచిగా చూపి ప్రజలను ఇంకెంతకాలం మభ్య పెడతారన్నారు. దేశంలో గత ఏడు దశాబ్దాలలో అభివృద్ధే జరగనట్లు ప్రధానితోపాటు బీజేపీ నేతలు మాట్లాడుతుండడం దారుణమన్నారు. చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. దేశం కోసం కాంగ్రెస్ ఎన్నో త్యాగాలు చేసిందని ఇలాంటి ట్రాక్ రికార్డు బీజేపీకి లేదన్నారు. దేశ రాజకీయాల్లో మతాన్ని జొప్పించి, కేంద్ర సంస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలంతా ఏకమై దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా మాట్లాడుతూ కాంగ్రెస్‌ది అభివృద్ధి, సంక్షేమ పథమైతే బీజేపీది విద్వేషపథమని చురకలంటించారు. గ్యారెంటీ పథకాల అనంతరం బీజేపీ నేతలకు మతి భ్రమించి ఏవేవో మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, దక్షిణకన్నడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దినేశ్ గుండూరావుతోపాటు మాజీ ముఖ్యమంత్రి వీరప్పమొయిలీ, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


వేదికపై నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య


భారీగా హాజరైన కార్యకర్తలు

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కండి..

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. గ్యారెంటీ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని కూడా ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర వైఫల్యాలను వివరిద్దామని, ఎవరికి టికెట్ ఇచ్చినా ఐక్యంగా పనిచేసి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుందామని నేతలు పిలుపునిచ్చారు. భారీగా కార్యకర్తలు తరలిరావడంతో పార్టీ నేతల్లో ఉత్సాహం ఉరకలేసింది.

మాత్యులకే అవకాశం..!

- లోక్‌సభ బరిలోకి రాష్ట్ర మంత్రులు
- అత్యధిక స్థానాలే లక్ష్యంగా అధికార పార్టీ వ్యూహాలు
- రాష్ట్ర రాజకీయాలే కావాలంటున్న కొందరు నేతలు
- నటుడు డాలీ ధనంజయ్‌కు టిక్కెట్?



బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఎక్కువ లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ కసరత్తు సాగిస్తోంది. తొలుత మంత్రులను రంగంలోకి దించాలని భావించిన పలు కారణాలతో వెనుకడుగు వేశారు. అయితే మంత్రులను బరిలోకి దించితేనే ఎక్కువ స్థానాలు సాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న తరుణంలో మరోసారి మంత్రులను అభ్యర్థులను చేసే ఆలోచనలో రాష్ట్ర పార్టీ అడుగులు వేస్తోంది. ఇదే అభిప్రాయా న్ని ఢిల్లీ నేతలకు సైతం వివరించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర శాసనసభలో కీలకమైన బడ్జెట్ ప్రతిపాదన ప్రక్రియ ముగిసింది. ఇక పూర్తిస్థాయిలో లోక్‌సభ ఎన్నికలకోసమే పనిచేయాలని ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సూచించారు. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ లెజిస్లేచర్ భేటీలో లోక్‌సభలో అనుసరించాల్సిన వ్యూహాలపైనే దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా ప్రస్తావనలో ఉండే మంత్రులలో బీదర్ నుంచి అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రెను అభ్యర్థి చేయదలిచారు. ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న బాల్కి టికెట్‌ను కుమారుడికి ఇచ్చేలా అంగీకరించినట్లు తెలుస్తోంది. బెళగావి లోక్‌సభ నుంచి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పేరు ప్రస్తావనలో ఉండగా ఆమె తనకు బదులుగా కుమారుడు మృణాల్‌కు టికెట్ ఇస్తే గెలిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. బెళగావి జిల్లా చిక్కోడి స్థానం నుంచి సతీశ్ జార్కిహొళిని పోటీ చేయాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. దావణగెరె లోక్‌సభ స్థానం నుంచి ఉద్యానవనశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్‌ను బరిలోకి దించాలని భావిస్తున్నారు. చామరాజనగర నుంచి మంత్రి మహదేవప్ప పేరు ప్రస్తావనలో ఉంది. ఆయన కుమారుడి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. శివమొగ్గ నుంచి విద్యాశాఖ మంత్రి మధు బంగారప్పను అభ్యర్థి చేయదలిచారు. కానీ మంత్రి సోదరి, ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ భార్య గీతాను అభ్యర్థిని చేస్తామని సూచించినట్లు తెలుస్తోంది. అయితే గీతా శివరాజ్ ఇప్పటికే మూడుసార్లు ఓడిపోయినందున మరోసారి ప్రయోగం సరికాదని పార్టీవర్గాలు తెల్పి చెప్పినట్లు సమాచారం. తుమకూరు టికెట్‌ను సహకారశాఖ మంత్రి రాజణ్ణకు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన పోటీకి సిద్ధమని ప్రకటించారు. ఇక బెంగళూరు దక్షిణ బీజేపీకి బలమైన నియోజకవర్గం. గతంలో ఈ స్థానం నుంచి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకణి పోటీ చేసినా గెలవలేకపోయారు. అందుకే రాజకీయ అనుభవం ఉన్న ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావును పోటీ చేయించే ఆలోచన ఉంది. హావేరి నుంచి మంత్రి శివానంద పాటిల్‌కు టికెట్ ఇవ్వదలిచారు. ఖాళీ అయ్యే బసవనబాగేవాడి టికెట్‌ను కుమారుడు సత్యజిత్ పాటిల్ లేదా కుమార్తె సంయుక్త పాటిల్‌లలో ఒకరికి టికెట్ ఇస్తామని నేతలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మండ్య నుంచి వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి పేరు ప్రస్తావనకు వచ్చినా ఆయన రాష్ట్ర రాజకీయాలను వీడేది లేదని, నాయకులకు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. అయితే మండ్య కీలకమైన నియోజకవర్గం కావడంతో ఇక్కడ మరిన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాష్ట్ర రాజకీయాల్లోని అన్ని పార్టీలలో సినిమా నటులు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి వచ్చే ఎన్నికల్లో ప్రముఖ హీరో డాలీ ధనంజయ్‌ను బరిలోకి దింపాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. మైసూరు నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ టికెట్ల అంశమై శనివారం మంగళూరులో కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ 28 నియోజకవర్గాలకు అభ్యర్థులను దాదాపు ఖరారు చేశామని, మరో విడత సర్వే జరిపాక పేర్లు ప్రకటిస్తామన్నారు. ఈ ప్రక్రియ వేగవంతంగానే ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


లక్ష్మీ హెబ్బాళ్కర్


దినేశ్ గుండూరావు


ఈశ్వర్‌ఖండ్రె


డాలీ ధనంజయ్

మంగళూరులో మార్పు తథ్యం

- బీజేపీ పట్ల విసిగి వేసారిన ప్రజలు
- ఈసారి గెలుపు కాంగ్రెస్‌దే : డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కంచుకోటగా ఉన్న మంగళూరు ప్రాంతంలో ఈ సారి ప్రజల్లో మార్పు కనిపిస్తోందని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దీని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. దక్షిణ కన్నడ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన మంగళూరులోని వామంజూరిలో తుళునాడు కంబళ తిరువెలోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన బీజేపీ సంఘ్‌పరివార్‌ల మతతత్వ అజెండా కారణంగా కోస్తా ప్రాంతంలో అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. వ్యాపార కార్యకలాపాలు తగ్గిపోయాయని, విద్యార్థులు విద్యాభ్యాసానికి దూరమవుతున్నారని, నిరుద్యోగ సమస్య అధికంగా ఉందన్నారు. ఫలితంగా కోస్తా అంతటా అభివృద్ధి కార్యకలాపాలపై ప్రభావం కనిపిస్తోందన్నారు. రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదన్నారు. దక్షిణ కన్నడ జిల్లా శాంతి సామరస్యాలకు భంగం వాటిల్లిందని బీజేపీ సంఘ్‌పరివార్‌లు మతం ముసుగులో విద్యార్థులు, యువత పండంటి జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆయన ఆరోపించారు. కోస్తాలోని అనేక ప్రాంతాల్లో రాత్రి 7 అయితే చాలు ప్రజలు వీధుల్లో సంచరించేందుకు సైతం భయపడుతున్నారని ఉద్యోగాల కోసం యువత బెంగళూరు, ముంబై, సౌదీలకు తరలి వెళుతున్నారన్నారు. భక్తి మార్గం మంచిదేనని అయితే ఈ అంశంపై ప్రజలను నిరంతరం రెచ్చగొడుతూ అడ్డుగోడలను నిర్మించడం, శాంతి సామరస్యాలను దెబ్బతీయడం సరికాదన్నారు. కాగా జెరోనా పాఠశాల వివాదంలో ప్రభుత్వం జోక్యం చేసుకోదన్నారు. బడ్జెట్‌లో మైనార్టీలకు 1 శాతం కేటాయించినా బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని వారి విద్వేష అజెండా మరీ దారుణంగా ఉందన్నారు. రూ 3.71 లక్షల కోట్ల బడ్జెట్‌లో మైనార్టీల విద్య, సామాజిక వికాసానికి రూ.3వేల కోట్లు కేటాయించడాన్ని బీజేపీ వ్యతిరేకించడం చూస్తుంటే వారి అజెండా ఏమిటో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బెంగళూరు గ్రామీణ లోక్‌సభా నియోజకవర్గ నుంచి సిట్టింగ్ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేష్‌పై మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి పోటీచేసినా తాను స్వాగతిస్తానన్నారు. ఓటరుదేవుళ్ళే ఎవరు ఎంపీ కావాలో తీర్మానిస్తారన్నారు.


మహలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న డీసీఎం

యడియూరప్ప అద్దంలో చూసుకోవాలి : మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ నేతల మధ్య ఆరోపణలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. బీజేపీ అగ్రనేత, మాజీ సీఎం యడియూరప్పను ఉద్దేశించి రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. సీఎం సిద్దరామయ్యను విమర్శించే ముందు యడియూరప్ప అద్దంలో ముఖం చూసుకోవాలన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకుడిగా యడియూరప్ప 606 హామీలను ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక కేవలం 55 మాత్రమే అమలు చేశారన్నారు. 2013లో సిద్దరామయ్య 165 హామీలు ఇచ్చారని వాటిలో 158 అమలు చేశారన్నారు. అన్నభాగ్య, క్షీరభాగ్య, షాదీ భాగ్య, ఇందిరా క్యాంటీన్‌లకు ప్రజాదరణ తారస్థాయిలో లభించిందన్నారు. ఇటీవలి ఎన్నికల్లోనూ ఐదు గ్యారెంటీలు ప్రకటించామని, అన్నింటినీ అమలు చేశామన్నారు. ఇదో రికార్డు అని రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి గ్యారెంటీలు అందిస్తున్నామన్నారు.



బెళగావి జిల్లా విభజనకు సిద్ధమైన సర్కారు

- నివేదిక ఇవ్వాలని ప్రాంతీయ కమిషనర్‌కు ఆదేశాలు

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో జిల్లా ఏర్పాటుకు కసరత్తు సాగుతోంది. రాష్ట్రంలోనే అత్యంత పెద్దజిల్లాగా ఉన్న బెళగావిని రెండుగా విభజించాలని దశాబ్దాల కాలంగా డిమాండ్ ఉంది. మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో వివాదాలకు కారణమవుతుందని వాయిదాలు వేస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ వస్తుందనే బెళగావిలో సువర్ణసౌధను ఏర్పాటు చేశారు. తద్వారా సమైక్య కర్ణాటక నినాదానికి బలం చేకూరింది. అయితే బెళగావిని రెండు జిల్లాలు చేయాలనే ప్రతిపాదన శాసనసభ సమావేశాలు జరుగుతున్న తరుణంలోనే తెరపైకి రావడం ప్రత్యేకతను సంతరించుకుంటోంది. ఈమేరకు సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రాంతీయ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశించడం మరో చర్చకు కారణమవుతోంది. బెళగావి జిల్లా రాష్ట్రంలోనే అత్యంత విశాలమైనది. 15 తాలూకాలు, 18 శాసనసభ నియోజకవర్గాలు, 2 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. బెళగావిని విభజించి బైలహొంగళ లేదా గోకాక్, అథణిలను జిల్లాగా రూపొందించాలని నిరంతరం పోరాటాలు సాగుతున్నాయి. జిల్లాపోరాట సమితి బెళగావిలో శాసనసభ సమావేశాలు జరిగిన ప్రతిసారి ఆందోళన ద్వారా తమ భావాలను వ్యక్తపరుస్తున్నారు. ఇలా కొనసాగుతుండగానే ప్రాంతీయ కమిషనర్ సంజయ్‌శెట్టణ్ణవర్‌కు ప్రభుత్వం నివేదిక కోరడాన్ని పోరాట సమితి స్వాగతిస్తోంది. రెండు దశాబ్దాలక్రితమే జిల్లా విభజన అంశానికి అడుగులు పడ్డాయి. 1997లో జేహెచ్ పటేల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జనాభా, తాలూకాలు, హోబళిలను గుర్తించాలని సూచించారు. బెళగావిని విభజించి చిక్కోడి లేదా గోకాక్ జిల్లాగా మార్చాలని మంత్రివర్గంలోనూ చర్చించారు. జిల్లా విభజనకు అప్పట్లో కన్నడ సంఘాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. నెలరోజులపాటు నిరంతర పోరాటాలు సాగాయి. అప్పటి ప్రముఖ నేతలు సీఎంలుగా వ్యవహరించిన నిజలింగప్ప, రామకృష్ణ హెగ్డే, పాత్రికేయుడు పాటిల్ పుట్టప్ప వ్యతిరేకించడంతో అప్పటి ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దీనికితోడు సరిహద్దు వివాదం సుప్రీంకోర్టులో కొనసాగుతున్నందున సమంజసం కాదని భావించారు. బెళగావి జిల్లా విభజన జరిగితే అభివృద్ధి వాతావరణం నెలకొంటుందని, పాలనా వ్యవస్థ మెరుగవుతుందని ప్రభుత్వ సౌలభ్యాలు సులభంగా ప్రజలకు చేరుతాయనే అభిప్రాయాలు ఉన్నాయి. అథణి నుంచి బెళగావికి 250 కిలోమీటర్ల దూరం ఉంది. ఇలా జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఒక రోజంతా ప్రయాణానికే సరిపోతుంది. సమస్యలపై జిల్లా అధికారులకు విన్నవించాలని సుదీర్ఘ ప్రయాణం, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. అందుకే చిక్కోడి ప్రాంత ప్రజలు వ్యాపార, వ్యవహారాలు, ఆరోగ్యం, ఉద్యోగాలతోపాటు ఇతరత్రా అన్నింటికీ మహారాష్ట్రలోని కొల్హాపుర, మీరజ్, పుణే నగరాలకు వెళ్తారు. తద్వారా రాష్ట్ర ఆదాయానికి గండి పడుతోంది. జిల్లా ఏర్పడితే సరిహద్దులో విద్య, పరిశ్రమలు, ఉద్యోగాలు, మార్కెటింగ్ సౌలభ్యాలు ఏర్పడతాయని భావిస్తున్నారు. భౌగోళికంగా రెండో అతిపెద్ద జిల్లా బెళగావిని విభజిస్తే మరాఠాల ప్రభావం మరింత ఎక్కువ అవుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా సుప్రీంకోర్టులో సరిహద్దు వివాదం పెండింగ్‌లో ఉంది. విభజన జరిగితే మరాఠా మాట్లాడేవారి సంఖ్య పెరిగి వారి వ్యవహారాలు పెరిగే అవకాశం ఉంది. బెళగావి జిల్లా పూర్తిగా మరాఠాల హస్తగతమైనా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. బెళగావితోపాటు పలు తాలూకాలను మహారాష్ట్రలో కలపాలనే డిమాండ్‌తో ఏటా కన్నడ రాజ్యోత్సవం, శాసనసభ శీతాకాల సమావేశాల వేళ ఆందోళన, హింసాత్మక సంఘటనలు ఉన్నాయి. జిల్లా విభజన జరిగితే పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయోననే అనుమానాలు ఉన్నాయి.



బెళగావిని రెండో రాజధాని చేయండి

కన్నడ సంఘాల ఐక్యకూటమి క్రియా సమితి అధ్యక్షుడు అశోక్ చందరగి మాట్లాడుతూ జిల్లా విభజనకంటే తొలుత ప్రభుత్వం బెళగావిని రెండో రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సువర్ణసౌధకు ప్రభుత్వ కార్యాలయాలు తరలించాలని, సుప్రీంకోర్టులో వివాదాలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడే మరాఠాలు సవారీ చేస్తున్నారని, విభజన జరిగితే జిల్లా మారిందని వారూ మద్దతు ఇవ్వరని పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.83	1,610.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	142	8,757
సామర్థ్యం (టీఎంసీలు)	9.31	38.49

రేపు కనకదుర్గమ్మ సిడిబండి రథోత్సవ సన్నాహక సమావేశం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 17: నగరంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయ వార్షిక సిడీ బండి రథోత్సవ సన్నాహక సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు జరగనుంది. జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు హిందూ ధార్మిక సంస్థలు, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనడం వల్ల పారిశుద్యం, తాగునీరు, రవాణా వ్యవస్థ, తదితరాల కోసం గత సంవత్సరంలో తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యల గురించి అవసరమైన సమాచారంతో అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

నాటక కళాకారుల జన్మస్థలం బళ్లారి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రకాశ్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 17: ఎందరో నాటక కళాకారులను అందించిన ప్రాంతమే బళ్లారిఅని రాఘవ మెమోరియల్ అసోషియేషన్ గౌరవ కార్యదర్శి ఎన్.ప్రకాశ్ అన్నారు. నగరంలోని ఆదర్శ విద్యాలయంలో నాట్యకళా ప్రపూర్ణ బళ్లారి రాఘవాచార్యుల సంస్కరణ అన్నదాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు వినయాన్ని పెంపొందించుకుని బాలబాలికలు దేశానికి కీర్తీ తీసుకొని రావాలన్నారు. తదనంతరం వశిష్ట కళాశాల కన్నడ లెక్చరర్ డి.కరియప్ప, బళ్లారి రాఘవ సాధించిన విజయాలు, ఆయన ఎదిగిన తీరు, నేర్చుకున్న కళలు అమోఘమన్నారు. రాఘవ తనకు ఇచ్చిన పాత్రకు జీవం పోసేవాడని, నట నైపుణ్యం కలిగిన సాదాసీదా పెద్దమనిషి అని అన్నారు. కార్యక్రమానికి కసాపా యూనిట్ అధ్యక్షుడు నాగారెడ్డి అధ్యక్షత వహించారు. పరిషత్ గౌరవ కార్యదర్శి కార్తీక్ మరిస్వామి, ఆదర్శ విద్యాలయ హెడ్ గురుస్వామి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రమణప్ప భజంత్రీ, రిటైర్డ్ లెక్చరర్ రామాంజినేయులు, రంగస్థల కళాకారుడు పురుషోత్తమ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బస్సుపాస్‌లపై హర్షం



నౌషద్ అలీ

సిరుగుప్ప, ఫిబ్రవరి 17 : రాష్ట్ర బడ్జెట్‌లో జర్నలిస్టులకు బస్సు పాస్ ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం అమోఘమని సిరుగుప్ప తాలుకా జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ నౌషద్ అలీ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణ, నగర ప్రాంతాలలో పనిచేసే జర్నలిస్టులకు ఉచిత బస్సు పాస్‌లు కల్పించాలని నిర్ణయించారని, ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులకు ల్యాప్‌టాప్‌లు, నివేశన స్థలాలు, డిజిటల్ కెమెరాలను ఇవ్వాలని కోరారు.

సమ్మెను విజయవంతం చేద్దాం



కరపత్రాలు పంచుతున్న నాగన్నగౌడ

కంప్లి, ఫిబ్రవరి 17 : ఈ నెల 27న బెంగళూరులో ఉద్యోగస్తులు చేపడుతున్న సమ్మెను విజయవంతం చేద్దామని ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నాగన్న గౌడ తెలిపారు. ఆయన శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమ్మెలో పాత పించన్లు జారీ చేయాలని, 7వ వేతన సంఘ నివేదికను అమలు చేయాలని, ఆరోగ్య సంజీవని పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కావున ప్రతి ఒక్కరు ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు.

దేశ నిర్మాణంలో రాజ్యాంగమే ప్రధానం

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 17: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన దేశ నిర్మాణంలో రాజ్యాంగం బలమైన పునాదిగా నిలిచిందని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమంలో భాగంగా నగరంలోని కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శన, సంగీత , సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1947కి ముందు వందఏళ్లపాటు పరాయి పాలనకు వ్యతిరేకంగా లక్షలాది మంది ప్రజలు వివిధ రూపాల్లో చేసిన త్యాగాలకు ప్రతిఫలమే మన రాజ్యాంగం అన్నారు. అనేక దేశాల రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన తర్వాత మన దేశ రాజ్యాంగం ఏర్పడిందన్నారు. రాజ్యాంగ రూపకల్పన డిసెంబరు 1946నుండి డిసెంబర్ 1949వరకు జరిగిందన్నారు. ఇందుకు సుమారు 2సంవత్సరాలు 11నెలల 18రోజులు పట్టిందన్నారు. డా.బిఆర్.అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీకి ఎంతో ఘనత దక్కుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప రాజ్యాంగంతో ప్రమాణం చేయిం చారు. రాజ్యాంగ అవగాహన జాతాలో భాగంగా వాల్మీకి భవన్‌లో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలు గీసిన ఉత్తమ చిత్రాలను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నభాగ్య, గృహజ్యోతి, యువనిధి, గృహలక్ష్మి, శక్తి పథకాలపై వేసిన చిత్రాలు కళా ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈసందర్భంగా జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సతీశ్, జిల్లాషెడ్యూల్డ్ తరగతుల సంక్షేమాధికారి దివాకర్, జలాలప్ప తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు



కుడితిని రాజ్యాంగ సమావేశంలో ఖాళీగావున్న కుర్చీలు

సమావేశంలో కుర్చీలు ఖాళీ.. ఖాళీ!

కంప్లి, ఫిబ్రవరి 17 : రాజ్యాంగ రథం ఊరేగింపు శుక్రవారం కుడితినికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేవలం ఐదుగురు మాత్రమే పాల్గొన్నారని డీఎస్ఎస్ జిల్లా సంచాలకులు రాము, గిరీష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కుడితిని పట్టణంలో శనివారం వాల్మీకి భవనంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ఈ సమావేశం విజయవంతం చేపట్టారు. కానీ కుడితిని పట్టణం ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్ నిర్లక్ష్యం వల్ల ఈ రాజ్యాంగం ఊరేగింపు, సమావేశంలో ఎవరూ లేక ఖాళీ కుర్చీలు మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బసవేశ్వరుడి జీవితం అందరికీ ఆదర్శం

జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 17: సాంస్కృతిక సారధి జగజ్యోతి బసవన్న జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లాపంచాయితీ సీఈఓ. రాహుల్ శరణప్ప సంకనూర్ తెలిపారు. జిల్లాపంచాయితీ తరపున శనివారం ఆయన జగజ్యోతి బసవన్న చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఆదర్శ సమాజం అనే భావనను బసవన్న రూపొందించారన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప మాట్లాడుతూ 12వ శతాబ్దంలో బసవన్న దోపిడీకి వ్యతిరేకంగా గళం విప్పారన్నారు. బసవన్నను దేశ సాంస్కృతిక నాయకుడిగా ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి సిద్దరామయ్య హర్షం వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయక సంచాలకులు బి.నాగరాజు, జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బసవన్న చిత్రపటాన్ని ఆవిష్కరించిన సీఈఓ శరణప్ప

ఘనంగా బసవన్న జయంతి వేడుకలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 17 : అందరూ సరిసమాన హక్కులు పొందాలని చాటిచెప్పిన ఏకైక వ్యక్తి బసవన్న అని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. సిరుగుప్ప పట్టణం బళ్లారి రోడ్డులో బసవన్న విగ్రహానికి శనివారం ఆయన పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు.

బసవన్నను అందరూ స్మరించుకోవాలి

కంప్లి, ఫిబ్రవరి 17: సాంస్కృతిక నాయకుడు బసవన్నను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలంటూ తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బసవన్న చిత్రపటానికి పూజలు చేపట్టి మొక్కులు సమర్పించుకున్నారు.





సిరుగుప్ప సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు ● కంప్లిలో బసవన్న చిత్రపటానికి పూజలు చేస్తున్న అధికారులు

వైభవంగా ఒడ్డు అల్లదరాయ స్వామి రథోత్సవం

తోరణగల్లు, ఫిబ్రవరి 17 : సండూరు తాలుకా ఒడ్డు గ్రామంలో వెలసిన శ్రీ అల్లదరాయ స్వామి (ఆంజనేయ స్వామి) రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అల్లదరాయస్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, వెండి కవచధారణ, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామంలో వేలాది మంది భక్తులు హాజరయ్యారు. కోరుకున్న వరాలు తీర్చే దేవుడుగా శ్రీ అల్లదరాయ స్వామి ప్రసిద్ది చెందారు. దేవస్థానంలో స్వామి వారికి వివిధ విశేష పూజలు అనంతరం స్వామివారి విగ్రహాన్ని రథంలో ప్రతిష్ఠించి ఘనంగా రథాన్ని లాగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు వివిధ షాపులు వెలిశాయి. రథోత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. రథంపై పూలు చల్లి తమ మొక్కులు తీర్చుకున్నారు.



రథంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తున్న అల్లదరాయస్వామి

హెల్మెట్ వాడకంపై అవగాహనా ర్యాలీ



హెల్మెట్ వాడకంపై నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 17 : బళ్లారి నగరంలో హెల్మెట్ వాడకంపై ఐజీ లోకేష్ కుమార్ నేతృత్వంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ రంజిత్ కుమార్ భండారి ప్రారంభించారు. అనంతరం హెల్మెట్ వాడకం వలన కలిగే ఉపయోగాలు, లాభాల గురించి, హెల్మెట్ వాడని పక్షంలో జరిగే పరిణామాల గురించి వాహనదారులకు వివరించారు. బళ్లారి దుర్గమ్మ దేవి ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని పలు వీధుల గుండా కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిటీ డీఎస్పీ నందరెడ్డి, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయ్యన్న గౌడ పాటిల్, పలు పోలీసు ఉన్నతాధికారులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

జైలును సందర్శించిన బాలల హక్కుల కమిషన్



జైలును సందర్శిస్తున్న శశిధర్ కోసంబే తదితరులు

బళ్లారి,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు శశిధర్ కోసంబే శనివారం జిల్లా కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. మహిళా, పురుష ఖైదీల సెల్‌లను సందర్శించి వారి ఆరోగ్యం, ఆహారం, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అలాగే వారి కుటుంబీకులు, పిల్లలు భవిష్యత్తు గురించి తెలుసుకున్నారు. జైల్లో ఉంటూ గ్రంథాలయాల్లో పుస్తకాలు, వార్తపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఖైదీలు క్షణిక ఆవేశంలో జరిగిన పొరపాట్ల కారణంగా ఈరోజు కుటుంబాలకు దూరమై మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు రాఘవేంద్ర, జైలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ అంబరీశ్ పూజారి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, నాన్ ఆర్గనైజేషనల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనేష్ పాల్గొన్నారు.

దేశ సంప్రదాయాలను మరువవద్దు



సాంగాత్రేయ పాఠశాలలో మాట్లాడుతున్న రోహిత్ అక్ష

కంప్లి, ఫిబ్రవరి 17 : మహిళలు దేశ సాంప్రదాయాలను మరువరాదంటూ ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి పథకం డైరెక్టర్ రోహిత్ అక్ష తెలిపారు. కంప్లి పట్టణంలోని సాంగాత్రేయ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన శనేశ్వర పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ని తరాలు మారినా సాంప్రదాయాలను మరిచినట్లయితే మన దేశంపై భక్తి పోయి నట్లేనని తెలిపారు. కావున నేటి యువతరానికి టీవీ, కంప్యూటర్ వ్యామోహం పెరిగి వీటిపై ఆసక్తి తగ్గిపోయిందన్నారు. సాంప్రదాయాలపై ప్రతి ఒక్కరు నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేయాలన్నారు. వారితోపాటు శాంతల, విద్యాధర్, హేమయ్య స్వామి, మూకయ్య స్వామి, షణ్ముఖప్ప, వాగేష్, హాలప్ప, బసవరాజు, సంజీవ్ కుమార్, రేఖ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చేళగుర్కి చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 17: తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక ప్రాంతమైన చేళగుర్కి చెక్‌పోస్టు వద్ద పీడీ హళ్లి ఎస్ఐ నాగభూషణం నేతృత్వంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముందస్తుగా అనంతపురం, కడప, చిత్తూరు, గుంతకల్లు, గుత్తి తదితర ప్రాంతాలకు వచ్చి వెళ్లు వాహనాలపై ముమ్మర తనిఖీలు చేపట్టారు. పలు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఉమేష్, సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, పలువురు పోలీసు సిబ్బంది తదితరులు వున్నారు.



చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో ఎస్ఐకు సన్మానం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 17 : బళ్లారి తాలుకా పీడీ హళ్లి ఎస్ఐ నాగభూషణ్ నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో పీడీ హళ్లి గ్రామ ప్రముఖులు రిటైర్డ్ ఏఎస్ఐ వన్నూరప్ప, కాంట్రాక్టర్ బైరప్ప, గ్రామ పంచాయతీ సభ్యులు లింగన్న, అజమోతీ, యాల్పి యర్రిస్వామిలు శనివారం ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కంప్లి, ఫిబ్రవరి 17 : కంప్లి షుగర్ ఫ్యాక్టరీ వద్ద వెలసిన అభయాంజనేయస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం తమలపాకులపై రామనామం రాస్తూ ఆకులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. భ క్తలు పూజల్లో పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు.

హోసూరు జోన్

కోటమారియమ్మకు ముస్లింల పూజలు



కోటమారియమ్మ పూజల్లో పాల్గొన్న ముస్లింలు

హోసూరు, ఫిబ్రవరి 17: హోసూరు సమీపంలోని బాగలూరులో పురాతన కోటమారియమ్మ ఆలయానికి ముస్లింలు పూజా సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ ఆలయాన్ని ఇటీవల పునరుద్ధరించారు. 19న కుంభాభిషేకం జరగనుంది. శనివారం సాగిన విశేషపూజల్లో స్థానిక ముస్లింలు పాల్గొని అవసరమైన పూజా సామగ్రి అందజేశారు. తద్వారా భగవంతుడి సన్నిధిలో అందరూ ఒక్కటేనని మతసామరస్యం అనుబంధాలు పెంచేందుకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బాగలూరు పంచాయతీ అధ్యక్షుడు జయరామన్, అన్నాడీఎంకే కార్యదర్శి రవికుమార్, మాజీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథప్ప, మురళీ బాబు, ఉప కార్యదర్శి శ్రీనివాసులు, బషీర్, నజీర్, రసాత్, అమీర్‌జిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గాలి

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 17: కృష్ణగిరి కలెక్టర్ కార్యాలయం సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకానికి బ్రేక్ వేయాలని కలెక్టర్ కెఎం సరయు సూచించారు. ఈనెల 9న కృష్ణగిరి జిల్లా గెజిటెడ్ అధికారుల సమావేశంలో ప్లాస్టిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యల గురించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం మిషన్ లైఫ్ పథకం క్రింద తమిళనాడు ప్రభుత్వం కార్యాలయ విధానాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గింపు, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన విధానాలపై పలు ప్రాజెక్టులు అమలుజరుగుతున్నాయి. సింగిల్ యూజ్ కవర్లను వాడరాదని స్పష్టం చేశారు. అదే విధంగా ఎల్ఈడీ బల్బులను ఉపయోగించడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఉపయోగించిన ప్లాస్టిక్ ఉత్పత్తులను రీసైక్లింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు మొదట ఈ పద్ధతులను అనుసరించాలన్నారు. ఇది ఇతర జిల్లాలకు ఆదర్శంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ జనరల్ పుష్ప, హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ డి.స్నేహా, సబ్ కలెక్టర్ ప్రియంక పాల్గొన్నారు.



సేలం డీఐజీ నేతృత్వంలో అధికారుల సమావేశం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో మరింత అప్రమత్తత

తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారుల సమావేశంలో చర్చ

హోసూరు (సిఫ్‌కాట్), ఫిబ్రవరి 17: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమిళనాడు, సరిహద్దులోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారుల సమావేశం శనివారం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గస్తీని పెంచాలని, తనిఖీలు చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా సేలం డీఐజీ ఉమా మాట్లాడుతూ, సరిహద్దులోని కోలారు, కుప్పం సరిహద్దుల్లో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై మాట్లాడుతూ ప్రత్యేకించి మద్యం, ఇతర గిఫ్ట్ వస్తువుల రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ఇలా పలు అంశాలపై చర్చలు సాగాయి.

భూ సురక్షతో ఇకపై సమగ్ర సమాచారం

- ● చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు
- ● జడ్పీ సమావేశ మందిరంలో బసవన్న చిత్రపటం ఆవిష్కరణ

రాయచూరు, ఫిబ్రవరి 17 : భూముల వివరాలను సమగ్రంగా రూపొందించడంతో పాటు రైతులకు భూ వివాదాలు తలెత్తకుండా పకడ్బందీగా రికార్డులు నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ సురక్ష విధానాన్ని తీసుకొచ్చిందని రాష్ట్ర చిన్ననీటిపారుదల శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. భూ సురక్ష ఆప్‌ను శనివారం నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ఇక నుంచి భూ సంబంధ సమాచారం పూర్తిగా భూ సురక్ష పోర్టల్‌లో నిక్షిప్తమై ఉంటుందని, ఎవ్వరికి ఏ సమయంలో సమాచారం కావాలన్నా క్షణాలపై ఈ యాప్ ద్వారా లభిస్తుందని మంత్రి వివరించారు. ఈ యాప్ ద్వార పౌరులకు రైతులకు లభించే ప్రయోజనాల గురించివివరించారు.కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ తదితరులున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఎన్.ఎస్.భోసరాజు

బసవేశ్వరుడి మార్గం అనుసరణీయం

బసవేశ్వరుడి ఆశయాలు నేటి సమాజానికి అనుసరణీయమని మంత్రి అన్నారు. విశ్వ గురు బసవణ్ణ చిత్రపటాన్ని శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మంత్రి ఆవిష్కరించారు. బసవేశ్వరుని ముందు చూపు నేటితరం పాలకులకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య



మృతిచెందిన దేవమ్మ

రాయచూరు, ఫిబ్రవరి 17 : పొలం పని చేస్తున్న ఇద్దరు మహిళల మధ్య జరిగిన గొడవ ఒక మహిళ ఆత్మహత్యకు దారితీసింది. ఈ సంఘటన శనివారం జిల్లాలోని దేవదుర్గ తాలూకా హొన్నటగి గ్రామ శివారులో చోటు చేసుకుంది. హొన్నటగికి చెందిన బసవనగౌడ మాలిపాటీల్ పొలంలో మృతురాలు దేవమ్మ(35)తో పాటు మరో కొంతమంది మహిళలు పని చేస్తుండగా దుర్గమ్మతో దేవమ్మకు గొడవ ప్రారంభమైంది. ఈ క్రమంలో దుర్గమ్మ దుర్భాషలాడడంతో పాటు నిందాపూర్వక వ్యాఖ్యలు చేయడంతో మనస్తాపానికి గురైన దేవమ్మ సమీపంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న గబ్బూరు పోలీసులు నిందితు రాలైన దుర్గమ్మ ఆమె భర్త సిద్దప్పలను విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. మృతిచెందిన మహిళ లింగ సుగూరుతాలూకా కోటాగ్రామానికి చెందిందని గుర్తించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చైతన్య మహాప్రభు (జయంతి)




హరేకృష్ణ పారాయణను, భక్తి యోగాను విస్తృతం చేసిన శ్రీ చైతన్య మహాప్రభు 1486 ఫిబ్రవరి 18న నవద్వీప్ ప్రాంతంలో జన్మించారు. వల్లభాచార్యుని సమకాలీకుడు. మధుర, బృందావన ప్రాంతాలలో రాధాకృష్ణల గురించి వల్లభుడు ప్రచారం చేయగా బెంగాల్, ఒడిశాలలో చైతన్యుడు ప్రచారం చేశారు. సకల శాస్త్రాలు, పురాణాలలో పండితులై సన్యాసం స్వీకరించాక శ్రీకృష్ణ చైతన్యుడు అనే పేరు వచ్చింది. ఆయన జయంతిని 'గౌర పూర్ణిమ'గా ఆచరిస్తారు. 1534 జూన్ 14న నిర్యాణం చెందారు.

రామకృష్ణ పరమహంస (జయంతి)



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీరామకృష్ణ పరమహంస 1836 ఫిబ్రవరి 18న పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా కామార్పుకూర్‌లో జన్మించారు. అసలు పేరు గదాధర్ ఛటోపాధ్యాయ. విభిన్నమతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని అనుభవపూర్వకంగా తొలిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి. 'బెంగాల్ సాంస్కృతిక పున రుజ్జీవనానికి' కృషి చేశారు. గురువు సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు స్వామి వివేకానంద ఎంతో కృషి చేశారు. రామకృష్ణ మిషన్, మఠం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య శిబిరాల నిర్వహణ, గ్రామీణ, గిరిజనులకు సేవలు, ప్రకృతి వైపరీత్య బాధితులకు సహాయం, ప్రాథమిక విద్యను ప్రోత్సహించారు. 1886 ఆగస్టు 16న పరమపదించారు.

ఖయ్యూమ్ (జయంతి)



ఖయ్యూమ్‌గా చిరపరిచితులైన సంగీత దర్శకులు 'పద్మభూషణ్' గ్రహీత మొహమ్మద్ జహూర్ ఖయ్యూమ్ హష్మి 1927 ఫిబ్రవరి 18న పంజాబ్ రాష్ట్రం రహోన్ ప్రాంతంలో జన్మించారు. నాలుగు దశాబ్దాలపాటు సంగీతకారుడిగా, స్వరకర్తగా రాణించారు. సినీ గేయాలు, కవిత్వం కూడా రాసేవారు. గజల్‌ను తలపిస్తూ సంప్రదాయ హిందూస్తానీ సంగీతం ఉండడం ప్రత్యేకత. మెలోడీగా, ఎమోషనల్‌గా, సోల్‌ఫుల్‌గా సాగాయి. ట్రస్టును ఏర్పాటు చేసి ఆస్తిని సినీ కళాకారులకోసం విరాళంగా ఇచ్చారు. ఫిల్మ్‌ఫేర్, సంగీత నాటక అకాడమీ, జీవనసాఫల్య తదితర పలు పురస్కారాలు పొందారు. 2019 ఆగస్టు 19న కన్నుమూశారు.

టోనీ మారిసన్ (జయంతి)



ఖోలె ఆంటోనీ వోఫోర్డ్ మారిసన్ 1931 ఫిబ్రవరి 18న జన్మించారు. టోనీ మారిసన్‌గా పేరొందారు. అమెరికాకు చెందిన ఆమె నవలా రచయిత్రి, వ్యాస రచయిత గానే కాక పుస్తక సంపాదకురాలిగా, అధ్యాపకురాలిగా రాణించారు. తొలి నవల 'ది బ్లూయెస్ట్ ఐ' 1970లో ప్రచురితమైంది. 1988లో పులిట్జర్ పురస్కారం, 1993లో సాహిత్యానికి నోబెల్ ప్రైజ్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. నేషనల్ బుక్ ఫౌండేషన్‌తో సత్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. 2019 ఆగస్టు 5న కన్నుమూశారు.

మను భకర్ (పుట్టినరోజు)



మను భకర్ 2002 ఫిబ్రవరి 18న హర్యానా రాష్ట్రం జజ్జర్ జిల్లా గోరియా గ్రామంలో జన్మించారు. ఎయిర్‌గన్ షూటింగ్‌లో రాణించారు. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన పిన్న వయస్కురాలైన క్రీడాకారిణి. 16వ యేట 2018 వరల్డ్‌కప్‌లో రెండు బంగారు పతకాలు సాధించారు. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ప్రాతినిధ్యం వహించారు. ఉమెన్స్ 10మీ ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 236.5 పాయింట్లు సాధించారు. 2019, 2021 ఢిల్లీలో పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ బంగారు పతకం సాధించారు.

ప్రతిభావంతులకు అభినందన



ట్రోఫీలతో విద్యార్థులు

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 17: అబాకస్, చిత్రకళ, గణితం, హ్యాండ్‌రైటింగ్, రూబిక్స్ తదితర పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మాస్టర్ కిడ్స్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో బొమ్మనహళ్ళిలోని వింగ్స్ అకాడమీ నుంచి 13మంది పాల్గొనగా ఐదుగురు ఎంపికయ్యారు. ఇంపారెడ్డి నేతృత్వం వహించారు. కాగా హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటైన ముగింపు కార్యక్రమంలో ప్రతిభావంతులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. శనివారం స్థానిక విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సమాజసేవకుడు కనకమాధవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ దీపోత్సవం

చేళూరు, ఫిబ్రవరి 17: తాలూకా కేంద్రమైన చేళూరులోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవం, శుక్రవారం రథోత్సవం జరిగిన సంగతి విదితమే దీపోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బ్రాహ్మణసంఘం తాలూకా అధ్యక్షుడు నాగభూషణ తదితరులు పర్యవేక్షించారు.

రాజ్యాంగ విఘాత ప్రయత్నాలు తిప్పికొడదాం

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య



జాతీయ ఐక్యతా సమావేశంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగం లౌకికవాదాన్ని, సమానత్వాన్ని సామరస్యాన్ని చాటి చెబుతోందని దీనికి తూట్లు పొడిచేందుకు జరుగుతున్న ప్రయత్నాలను దేశ ప్రజలంతా కలసికట్టుగా తిప్పికొట్టాల్సిన తరుణం సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. భారతరాజ్యాంగం, జాతీయ ఐక్యతా సమావేశానికి సంబంధించి సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ప్రస్తుత ఏడాది అర్థవంతంగా కార్యక్రమాలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో రాజ్యాంగజాథా ఈనెల 23వరకు కొనసాగుతుందన్నారు. 24 నుంచి రెండు రోజులపాటు బెంగళూరులో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ అశుతోష్ వర్షిణి, డాక్టర్ గణేశ్‌దేవి, ప్రొఫెసర్ జయంతి ఘోష్, ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్, ప్రొఫెసర్ ఖంచా, ప్రశాంత్ భూషణ్, బెజవాడ విల్సన్, మేధా పాట్కర్ వంటి మేధావులు పాల్గొంటారన్నారు. 24న సమావేశం ప్రారంభం కానుండగా 25న భారీ ర్యాలీ ఉంటుందన్నారు. విద్యాసంస్థలలో రాజ్యాంగ పీఠిక చదవడం తప్పనిసరి చేశామని ఈసారి బడ్జెట్ ముఖచిత్రంపై కూడా ముద్రించామన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని 140 కోట్లమంది ప్రజలపైనా ఉందన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి



రాజ్యాంగ జాగృతిలో సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 17: అవగాహన కొరత కారణంగా రాజ్యాంగం కొన్ని వర్గాలకే పరిమితమైందన భావనం సమంజసం కాదని, సమానత్వ భాతృత్వంగా, అభివృద్ధి పథంలో సాగేలా రాజ్యాంగం రూపొందించబడిందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఆలంబాడి జోతేనహళ్ళి గామ పంచాయతీ పరిధిలో విచ్చేసిన రాజ్యాంగ జాగృతి జాథా రథయాత్ర కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. వంశపారంపర్య పాలనకు తిలోదకాలు ఇచ్చేలా ప్రజాప్రభుత్వ వ్యవస్థలో సమానత్వం, భాతృత్వం దిశగా ప్రతి ఒక్కరికి హక్కులు కల్పించేలా స్ఫూర్తిదాయకంగా రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ల సందర్భంగా సువర్ణ మహోత్సవం ఆచరిస్తున్నట్టు తెలిపారు. రాజ్యాంగం కేవలం ఒక వర్గానికి పరిమితమైందన భావన సరి కాదన్నారు. మానవుడికి హృదయం, ఆత్మ ఎంత ముఖ్యమో జీవనానికి రాజ్యాంగం అంతే ముఖ్యమన్నారు. ఇదే సందర్భంగా ప్రత్యేక విభాగం పిల్లలకు సహాయధనం చెక్కులను హునుకుంద గ్రామపంచాయతీ అధ్యక్షులు అందజేశారు. కళాకారుడు యల్లప్ప నేతృత్వంలో దేశభక్తి గీతాలు, అంబేడ్కర్ గురించిన పాటలు సభికులను అలరించాయి. పురవీధులను తోరణాలతో అందంగా ముస్తాబు చేయగా రాజ్యాంగ రథం సాగింది. వందలాదిమంది మహిళలు పూర్ణకుంభాలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నారాయణమ్మ, ఉపాధ్యక్షులు రామచంద్రప్ప, సభ్యులు వెంకటేశ్, అనితా మునియప్ప, సురేశ్ కృష్ణప్ప, బాబురెడ్డి, ఆలంబాడి సురేశ్, పద్మావతి నారాయణస్వామి, యశోదమ్మ, సీతారామప్ప, మమతా లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన



తాలూకా కార్యాలయం వద్ద నిరసన ఇలా...

బాగేపల్లి, ఫిబ్రవరి 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై (మధ్యాహ్న భోజనం పథకం) అక్షరదాసోహ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. సీఐటీయూ తాలూకా కార్యదర్శి ముస్తఫా మాట్లాడుతూ 2024-25 బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకం ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎటువంటి ప్రస్తావన తేలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. గౌరవధనాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం రూ.3,600 మాత్రమే ఇస్తున్నారని, ఇది నేటి జీవన అవసరాలకు ఏమాత్రం చాలదన్నారు. బడ్జెట్‌లో కనీస గ్రాంటుగానీ లేదా వేతనం పెంపు ప్రస్తావన లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. గత నెల మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కార్యకర్తలు బెంగళూరులో నిరవధిక ధర్నా చేశారని, అప్పట్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. రాష్ట్రంలో 1.19లక్షలమంది మంది మధ్యాహ్న భోజనం పథకం కింద పనిచేస్తున్నారని వీరికి గౌరవధనం రూ.2100-3600మధ్యన ఇస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగిన న్యాయం చేయాలన్నారు.

బహ్రెయిన్ త్రోబాల్ పోటీలకు కెప్టెన్‌గా సంపూర్ణహెగ్డే



క్రీడాకారులతో త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇండో-గల్ఫ్ ఇంటర్నేషనల్ త్రోబాల్ పోటీలలో భారత జట్టు కెప్టెన్‌గా సంపూర్ణహెగ్డే ఎంపికయ్యారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ ఎస్ మణి, ప్యాట్రన్ టీ రామణ్ణలు శనివారం బెంగళూరులో మీడియాకు తెలిపారు. బహ్రెయిన్‌లో ఈనెల 23 నుంచి మూడు రోజులపాటు అంతర్జాతీయస్థాయి మహిళా చాంపియన్‌షిప్ పోటీలు సాగుతాయన్నారు. జట్టులో కీర్తనా పరమేశ్వరన్, తనీషా జైన్, ఐలా రచిత విజయ్, కల్పనా చల్లా, పావని చోడశెట్టి, అనితా వీణా, దీపా హెబ్బార్, ప్రిషా ఉత్పలక్షి శ్రీనివాసన్ ఉన్నారు. కోచ్‌గా ఎస్ఎస్ సుబ్రమణ్య, రెఫరీగా డీ సంతోష్‌లు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కేఎన్ గోవిందరాజ్, కోశాధికారి డాక్టర్ పీ రాముతోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మోదీ చరిష్మాతోనే ఎన్నికలకు..



ప్రసంగిస్తున్న సీకల్ రామచంద్రగౌడ

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 17: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాతోనే ముందుకెళ్లాలని ఎక్కువ ఎంపీ స్థానాలు గెలుపొందడం ద్వారా మోదీ మళ్ళీ ప్రధాని అయ్యేందుకు కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలు, పట్టణంలోని వార్డులవారీ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, చక్కటి పాలన, ఆయన నాయకత్వంతో విశ్వనాయకుడు అయ్యారన్నారు. ఆయన వర్చస్సు దినదినాభివృద్ధి సాగుతోందని అదే విధంగానే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి ఎవరైనా పార్టీ విజయం కోసం అందరూ శ్రమించాలన్నారు. జేడీఎస్‌తో మైత్రి కారణంగా వారి సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి కాంతరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీకల్ ఆనందగౌడ, తాలూకా అధ్యక్షుడు కంబదహళ్ళి సురేంద్ర గౌడ, ఓబీసీ మోర్చా ఆంజనేయగౌడ తదితరులు పాల్గొన్నారు.

విద్యలో సాంకేతిక నైపుణ్యం అవసరం



సదస్సులో డాక్టర్ బర్నార్డ్ క్వింట్, కేంబ్రిడ్జ్ విద్యాసంస్థల అధ్యక్షుడు డీకే మోహన్

మహదేవపుర, ఫిబ్రవరి 17: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసం విద్యలో కీలకమైన సాంకేతిక నైపుణ్యాన్ని పూర్తిస్థాయిలో నేర్పించాల్సిన అవసరం ఉందని థేల్స్ సీనియర్ ఉపాధ్యక్షుడు, గ్రూప్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ బర్నార్డ్ క్వింట్ అభిప్రాయపడ్డారు. కేంబ్రిడ్జ్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన డిజిటల్ కర్ణాటక ఆర్ఐఎస్‌సీ-వి సదస్సు, సీఓపీఐను ప్రారంభించి మాట్లాడారు. ఆటోమోటివ్ రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఆర్ఐఎస్‌సీ-వీ(రిస్క్ ఫైవ్), సీఓపీఐ సాంకేతిక అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని ఇందుకు విద్యాసంస్థలు, పరిశ్రమలతో కలసి పని చేయనున్నట్టు తెలిపారు. కేంబ్రిడ్జ్ గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షులు డీకే మోహన్ మాట్లాడుతూ ప్రయోగాలలో నైపుణ్యం పెంచుకోవాలని, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో కేంబ్రిడ్జ్ గ్రూప్ విద్యాసంస్థలలో సీఈఓ నితిన్ మోహన్, మహీంద్రా అండ్ మహీంద్రా ఉపాధ్యక్షుడు డాక్టర్ శంకర్ వేణుగోపాల్, ఏఎల్ఎస్ఐ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సత్యగుప్తా, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ ఇందుమతి, సీసీసీఐఆర్ డైరెక్టర్ డాక్టర్ సిరిల్ ప్రసన్నరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అవెన్యూ రోడ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిక్‌పేట శాసనసభా నియోజకవర్గం పరిధిలోని ధర్మరాయస్వామి దేవస్థానం వార్డులోగల అవెన్యూ రోడ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక ఎమ్మెల్యే డా.ఉదయ్ గరుడాచార్ శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందసర్భంగా జరిగిన కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులకు తగిన రీతిలో గ్రాంట్లను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బాగల్‌కోటె జిల్లా కలాదగిలో ఉద్రిక్తత

▸▸ రంభాపుర పీఠాధిపతి వాహనంపై చెప్పు విసిరిన మహిళ

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల పీఠం జగద్గురు రంభాపురి శాఖ పీఠాధితపతి ప్రసన్న రేణుకా వీరసోమేశ్వర రాజదేశికేంద్ర శివాచార్య స్వామిజీ కారును అడ్డుకునే యత్నంలో ఓ మహిళ చెప్పు విసిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగల్‌కోటె జిల్లా కలాదగిలో శనివారం పంచగృహ గురు లింగేశ్వర మఠం పీఠాధిపతి ఎంపిక వివాదానికి సంబంధించి గొడవ జరిగింది. బాగల్‌కోటెలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన స్వామీజీ కలాదగిలోని మఠానికి వెళ్ళారు. మఠం వివాదంలో ఉన్నందున స్వామీజీ అక్కడకు వెళ్ళరాదని భక్తులు అభ్యంతరం తెలిపారు. అయినా ఏమాత్రం పట్టించుకోని స్వామీజీ మఠానికి వెళ్ళగా ఆందోళనకు దిగిన వారికి, స్వామీజీ మద్దతుదారులకు తోపులాట చోటుచేసుకుని ఉద్రిక్తతకు దారితీసింది. బాగల్‌కోటె జిల్లా కలాదగి గ్రామంలో ఉండే రంభాపురి జగద్గురు పీఠానికి అనుబంధమైన శాఖా మఠం గురులింగేశ్వర పీఠాధిపతి 2019లో శివైక్యం చెందారు. ఆయన తర్వాత పీఠాధిపతి ఎవరు కావాలనే విషయంపై మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఇద్దరు స్వామీజీల కారణంగా పీఠాధిపతి ఎంపిక వాయిదా పడుతూ వస్తోంది. పీఠాధిపతి ఎంపిక విషయమై కోర్టులో వివా దం సాగుతోంది. వివాదం కోర్టులో ఉన్నందున రంభాపురి స్వామీజీ కలాదగి మఠాన్ని సందర్శించడం సరికాదనేది వివాదమైంది. స్వామీజీ కలాదగ మఠానికి వస్తున్నారన్న సమాచారంతో గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. స్వామీజీ కారును అడ్డగించేందుకు ప్రయత్నించగా కారు ఆపకపోవడంతో ఓ మహిళ కారుపై చెప్పు విసిరింది. వెంటనే ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్థులు అందరూ రంభాపురి స్వామీజీ భక్తులే అయినా మద్దతిచ్చేవారు, వ్యతిరేకించేవారుగా రెండు గ్రూపులుగా ఏర్పడటంతో ఉద్రిక్తతకు దారితీసింది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి గుంపును చెదరగొట్టారు.

బీబీఎంపీ బడ్జెట్‌లో పాత్రికేయుల ఆరోగ్య నిధికి రూ.2 కోట్లు కేటాయించాలి



బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) 2024-25 వార్షిక బడ్జెట్‌లో పాత్రికేయుల ఆరోగ్య నిధికి రూ.2 కోట్లు, చిన్న పత్రికలకు ప్రకటనల కోసం రూ.2 కోట్లు కేటాయించాలని పాత్రికేయుల సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం బెంగళూరు నగర జిల్లా తరఫున పాత్రికేయులు శనివారం బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్‌కు ఒక వినతి పత్రం అందజేశారు. చీఫ్ కమీషనర్ తమ వినతిపై సానుకూలంగా స్పందించారని జిల్లా కార్యవర్గ సమితి సభ్యుడు ఎస్ సోమశేఖర గాంధీ, ప్రధాన కార్యదర్శి నరేంద్ర వార కట్వే, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, కోశాధికారి శివరాజ్, కార్యవర్గ సమితి సభ్యులు డా.స్వామి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

28 నుంచి టెలివిజన్ ప్రీమియర్ లీగ్ పోటీలు



వేదికపై బుల్లితెర కళాకారుల బృందం

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కళాకారులు, సాంకేతిక సిబ్బందికి బాసటగా నిలిచే ఉద్దేశ్యంతో ఎన్1 క్రికెట్ అకాడమీ నిర్వాహకుడు సునీల్ కుమార్ టెలివిజన్ ప్రీమియర్ లీగ్ మూడో సీజన్ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా నగరంలో శనివారం టిపిఎల్ ట్రోఫీ, జెర్సీల ఆవిష్కరణ జరిగింది. ఈ నెల 28 నుండి మార్చి 3 వరకు వాణిజ్యనగరి హుబ్బళ్ళిలోని కెఎస్‌సిఎ మైదానంలో జరుగనున్నాయి. బుల్లితెర కళాకారులంతా దాదాపుగా ఈ టోర్నమెంటులో పాలుపంచుకోనున్నారు. ట్రోఫీ విడుదల కార్యక్రమంలో నటులు శ్రీమురళి, నెనపిరలి ప్రేమ్, తిలక్, మంత్రి సంతోష్‌లాడ్, కాంగ్రెస్ నేత హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు. బుల్లి తెర నటీనటుల్లో ఉత్సాహం నింపుతున్న పోటీల నిర్వాహకుడు సునీల్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 12 ఓవర్ల ఈ పోటీలో మొత్తం 10 జట్లు పాల్గొంటాయన్నారు. ఐపీఎల్ తరహాలోనే బిడ్డింగ్ ద్వారా క్రీడాకారుల ఎంపిక చేపట్టామన్నారు. మొత్తం 170 మంది సెలబ్రిటీలు ఈ పోటీకి చేయూతనివ్వనున్నారని టైటిల్ ప్రాయోజకులుగా ఉన్న ఏవీఆర్ గ్రూప్స్‌కు చెందిన హెచ్ వెంకటేష్ రెడ్డి, అరవింద్ వెంకటేష్ రెడ్డి మీడియాకు చెప్పారు. మొత్తం 10 జట్లకు చెందిన క్రీడాకారులు నటులు ట్రోఫీ ఆవిష్కరణలో పాలు పంచుకున్నారు.

కన్నడ ఆర్డినెన్స్‌కు డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న కదంబ పదాధికారులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 17: దుకాణాలు, వాణిజ్య సముదాయాలు ఇతరత్రా వాటికి నామఫలకాలలో కన్నడలో 60శాతం తప్పనిసరి చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని, సరోజిని మహిషి నివేదికను వెంటనే అమలు చేయాలని తాలూకా కదంబ సైన్య డిమాండ్ చేసింది. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కన్నడ తొలి చక్రవర్తి కదంబ మయూర చాలుక్య పరమేశ్వర దక్షిణ పతేశ్వర ఇమ్మడి పులకేశి కాంస్యవిగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, బాదామినగర్‌లో విశ్వగురు జగజ్యోతి బసవణ్ణ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సరోజిని మహిషి నివేదిక అమలు చేయలు చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలలో కన్నడిగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాలూకా కదంబసైన్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను శాలువా, తలపాగాతో ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా కదంబ సైన్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవనహళ్ళి దేవరాజ్, కదంబసైన్య శిడ్లఘట్ట తాలూకా అధ్యక్షుడు సీఎన్ మునిరాజ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీ వెంకటేశ్, సంచాలకులు స్పోర్ట్స్ మునిరాజు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలతో మగువలకు మరింత అందం

▸▸ రాజ్‌కుమార్ కుమార్తె లక్ష్మీగోవిందరాజు



ప్రదర్శన ప్రారంభిస్తున్న వివిధ విభాగాల మహిళా సాధకులు

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలతో మగువల అందం మరింత పెరగనుందని కోరు కున్న నగలను కొనుగోలు చేసుకునేందుకు ప్రత్యేక ప్ర దర్శనలు ఎంతో సముచితమని ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ కుమార్తె లక్ష్మీ గోవిందరాజు అభిప్రాయపడ్డారు. యశ్వంతపురలో ఏర్పాటు చేసిన ది జ్యువెలర్స్ షోను ప్రముఖనటి నిశ్వికానాయుడుతో కలిసి శుక్రవారం లాంచనంగా ఆరంభించారు. ఇదే సందర్భంగా లక్ష్మీగోవిందరాజు మాట్లాడుతూ దేశంలో శతాబ్దాలుగా ఆభ రణాల సంస్కృతి ఉందని మారుతున్న కాలానికి అణుగుణంగా కొత్త డిజైన్‌లు వస్తున్నాయన్నారు. నిశ్వికానాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 40కు పైగా పేరొందిన జ్యూవెల్స్ కంపెనీలు ప్రదర్శనలలో పాల్గొనడం ద్వారా ప్రాంతాల వారిగా పేరొందిన డిజైన్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. నటనతో పాటు నగల ఎంపిక పట్ల ఆసక్తిగా ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సీటీ పల్లవి, పారిశ్రామికవేత్త స్వప్నారెడ్డి, కళాకారిణి కళాగంగాధర్, ఫ్యా షన్ డిజైనర్‌లు అర్పితా రందీప్, భవ్యగౌడతో పాటు జానపదగాయని దివ్యా ఆలూరులు భాగస్వామ్యులయ్యారు. షెరటాన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆదివారంతో ముగుస్తాయన్నారు.

నగరానికి మరో దక్షిణాఫ్రికా రెస్టారెంట్



హీరోయిన్‌లు ఐంద్రితారాయ్, హర్షికా పూణచ్చలతో సమీర్‌భాసిన్

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశ విదేశీయులు నివసించే బెంగళూరులో అందరికీ ఇష్టమైన రుచులకు కొదవలేదనేలా దక్షిణాఫ్రికాలో ప్రముఖమైన న్యాండూస్ రెస్టారెంట్ అందుబాటులోకి రావడం సంతోషమని ప్రముఖ హీరోయిన్‌లు ఐంద్రితా రాయ్, హర్షికా పూణచ్చలు అభిప్రాయపడ్డారు. మాల్ ఆఫ్ ఏషియాలో న్యాండూస్ రెస్టారెంట్‌ను శుక్రవారం లాంచనంగా ఆరంభించారు. న్యాండూస్ ఇండియా సీఈఓ సమీర్ భాసిన్ మాట్లాడుతూ గ్రిల్ రుచులకు పేరొందామన్నారు. దక్షిణాఫ్రికాలో 36 ఏళ్ళకిందట ఆరంభించామని ఇప్పటికే పలు దేశాలలో శాఖలు తెరిచామన్నారు. దేశంలో బెంగళూరు భిన్నమైన నగరంగా రాణిస్తోందని అందుకు అనుగుణంగానే ఇప్పటికే రెండుశాఖలు తెరిచామని తాజా మూడో శాఖ ద్వారా నగర ప్రజలకు మరింత చేరువ కావడం సంతోషమన్నారు. మార్కెటింగ్‌హెడ్ అనుశ్రీభోస్, ఆప రేషన్స్ డైరెక్టర్ అమిత్‌భయనా, అన్మోల్ అగర్వాలు ఉన్నారు.